క్లుప్తంగా

వైఎస్ జగన్‌తో భేటీ



వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ

చెన్నేకొత్తపల్లి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలమ్మగారి సాయికృష్ణ గురువారం సాయంత్రం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని రాజకీయ పరిస్థితులను వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు.

పాడి ఆవుల ఆకస్మిక మృతి



మృతి చెందిన పాడి ఆవులు

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని యల్లమ్మ వీధికి చెందిన ఆంజనేయులుకు సంబంధించిన నాలుగు పాడి ఆవులు గురువారం తెల్లవారుజామున మృతి చెందాయి. బాధితుడి వివరాల మేరకు..సుమారు 8 ఏళ్ల నుంచి పాడి ఆవులను పోషించుకుంటూ జీవనం సాగించేవాడు. బుధవారం రాత్రి పశువుల పాకలో నాలుగు ఆవులను కట్టేశాడు. గురువారం తెల్లవారే సరికి లేవలేని స్థితిలో ఒక్కొక్కటిగా నోటి నుంచి నురగలు కక్కతూ మృతి చెందాయి. సుమారు రూ.3.30 లక్షలు నష్టం కలిగిందని వాపోయాడు. ఆవులు తాగే నీటిలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు విషం కలిపి ఉంటారని అనుమానం వ్యక్తం చేశాడు. ఆవుల మృతితో జీవనోపాధి కోల్పోయానని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ



విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన అలవడుతాయని 6ఎ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎం.ఎస్.కులకర్ణి తెలిపారు. పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్‌సీసీ నమోదు కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ పావని ఆధ్వర్యంలో నిర్వహించారు. 6ఎ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎం.ఎస్.కులకర్ణి సుబేదార్ కొసులేంద్రసింగ్, రుద్ర బహదూర్ విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు చేసిన అనంతరం దరఖాస్తులలో నమోదు ప్రక్రియ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం వల్ల దేశానికి ఎంతో సేవ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ఎన్పీకుంట: ధనియానిచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన నాడు-నేడు పనులను కదిరి ఆర్డీఓ వంశీకృష్ణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాడు-నేడు పనులకు సంబంధించి చేసిన ఖర్చుల వివరాలను సంబంధిత అధికారులతో ఆరా తీశారు. పనులు చేపట్టిన సమయంలో తొలగించిన బండలు, నరికిన చెట్లను ఎంతకు విక్రయించారని, పాఠశాల ముఖద్వారం వద్ద గేటు ఏమయ్యిందంటూ అధికారులను ప్రశ్నించారు. వీటికి సంబంధించిన నివేదికలు సిద్ధం చేసి తమకు అందించాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి, ఉపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



బుక్కపట్నంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి

పుట్టపర్తి/పుట్టపర్తి టౌన్: ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అన్నారు. గురువారం ఆమె బుక్కపట్నం, కొత్తచెరువు రైతు సేవా కేంద్రాల్లో రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేశారు. రైతులకు 80 శాతం సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమాల్లో జేడీఏ సుబ్బారావు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఏఓ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త మెడికల్ కళాశాలలతో మరింత మంది వైద్యులు



గత ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేసింది. ఈ సంవత్సరం ఐదు, వచ్చే సంవత్సరంలో 7 కళాశాలలను ప్రారంభించాల్సి ఉంది. ఇవి ప్రారంభమైతే అదనంగా దాదాపు 2వేల మందికి వైద్య విద్యలో సీట్లు లభించేవి. పేద విద్యార్థుల డాక్టర్ కల నెరవేరేది. గత ప్రభుత్వం సిద్ధం చేసిన మెడికల్ కళాశాలల్లో యుద్ధప్రాతిపదికన సీట్లు భర్తీకి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మెడికల్ కళాశాలలు కొనసాగించాలి. ప్రయివేట్ పరం చేయాలనే ఆలోచన విరమించుకోవాలి.

–పక్కల శంకరయ్య, విద్యావేత్త, బత్తలపల్లి.



ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలి..



పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రపన్నుతోంది. నీట్లో ర్యాంకులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు వైద్య విద్యను ప్రభుత్వ కళాశాలల్లో చదవకుండా అడ్డుకట్ట వేస్తోంది. రాష్ట్రంలో కొత్త మెడికల్ కళాశాలలు వద్దని రాష్ట్ర ప్రభుత్వం లేఖలు రాయడం విచారకరం. ఎంతో మంది పేద విద్యార్థులు నీట్‌లో ర్యాంకులు సాధించి వైద్య కళాశాలల్లో అడ్మిషన్లు పొందేందుకు సిద్ధంగా ఉన్న తరుణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయం విద్యార్థులకు శాపంగా మారింది.

–బగ్గిరి రామ్మోహన్‌రెడ్డి, నీట్ విద్యార్థిని తండ్రి, బత్తలపల్లి

శిథిలం.. మేల్కొంటేనే పదిలం



మేడాపురంలో గ్రామీణ పశువైద్యశాల భవనం



కూలిపోయిన వైద్యశాల ప్రహరీ

- శిథిలావస్థలో మేడాపురం గ్రామీణ పశువైద్యశాల
- వర్షాలకు తడిసిపోతున్న దాణా, మందులు
- పెచ్చులూడటంతో ప్రమాదకరంగా ఉన్న భవనం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని మేడాపురంలో ఉన్న గ్రామీణ పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని సిబ్బంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 30 ఏళ్ల క్రితం భవనాన్ని నిర్మించి కొంతమంది సిబ్బందిని నియమించి చుట్టు పక్కల గ్రామాల్లోని పశువులకు వైద్యం అందిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు భవనం పెచ్చులూడుతున్నాయి. ఆసుపత్రి చుట్టూ నిర్మించిన ప్రహరీ ఓ వైపు కూలింది. వర్షాకాలంలో చాలా ఇబ్బందిగా ఉంటుందని గ్రామానికి చెందిన పలువురు రైతులు చెబుతున్నారు. ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పైకప్పుపై వర్షపు నీరు నిల్వ ఉండటంతో భవనం నెమ్ము వస్తోందని తెలిపారు. భవనంలో నిల్వ ఉంచిన పశువుల దాణా, మందులు వర్షపు నీటికి తడిసిపోతున్నాయి.

భవనం కూలక ముందే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నూతన భవనాన్ని మంజూరు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

బత్తలపల్లి: గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎం.శాంతన్న పేర్కొన్నారు. గురువారం 'సాక్షి'లో "తాగునీరు లేక కన్నీరు' శీర్షికన కథనం వెలువడింది. స్పందించిన ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. వారి ఆదేశాల మేరకు గురువారం ఆయన ఏఈ వరలక్ష్మీతో కలిసి మండలంలో పర్యటించారు. అనంతరం బత్తలపల్లి ఎస్సీ కాలనీలో పర్యటించి స్థానికులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బత్తలపల్లి ఎస్సీ కాలనీలో నూతనంగా బోరు వేయించనున్నట్లు తెలిపారు. నీటి సమస్య అధికంగా ఉన్న ఎస్సీకాలనీలో ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తామన్నారు. కాలనీవాసుల కోరిక మేరకు ట్యాంకర్‌ను శుద్ధజలాల ప్లాంట్ వద్ద అందుబాటులో ఉంచామన్నారు. సత్యసాయి నీరు గురువారం నుంచి రావాల్సి ఉండగా పైపులైన్‌లో ఎయిర్‌వాల్వ్ సమస్య తలెత్తిన కారణంగా రాలేకపోయినట్లు తెలిపారు. శుక్రవారం నుంచి అన్ని గ్రామాలకు సత్యసాయి నీరు సరఫరా అవుతుందన్నారు.



బత్తలపల్లిలో వివరాలు తెలుసుకుంటున్న డీఈ శాంతన్న

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



బత్తలపల్లి మండలం సంజీవపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న కేజీబీవీ విద్యార్థినులు



కుటాగుళ్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బత్తలపల్లి: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే వ్యాధులు దూరంగా ఉంటాయని పలువురు వక్తలు అన్నారు. 'స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాలల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞలు, ర్యాలీలు నిర్వహించారు. ఈఓఆర్డీ దివాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ, సర్పంచులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: కుటాగుళ్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల హెచ్‌ఎం వరప్రసాద్ రాజు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు పిచ్చిమొక్కలు తొలగించారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. అలాగే బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెహ్రూ యువకేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సంఘటన్ కార్యకర్త వాసుదేవన్ పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులు పిచ్చి మొక్కలు తొలగించారు. వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

తాడిమర్రి: మన గ్రామ పరిశుభ్రత మన చేతుల్లోనే ఉందని ఎంపీడీఓ విజయలక్ష్మీ, ఈఓఆర్డీ కామాక్షి పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులతో స్వచ్ఛతా హీ సేవాపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ఉద్దేశాలను వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ లక్ష్మీ, పీఆర్ ఇంజినీర్ రవి, ఎంఈఓలు కృష్ణమోహన్, వెంకటేష్, ఏఓ రమాదేవి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మగ్బూల్ హుస్సేన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఓబిలేసు, పంచాయతీ కార్యదర్శి ప్రవల్లిక మాట్లాడుతు ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు.

పవర్‌లూమ్స్ నుంచి చేనేతలను కాపాడాలి



ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

ధర్మవరం: పవర్‌లూమ్స్ నుంచి చేనేత పరిశ్రమను కాపాడాలని చేనేత కార్మిక సంఘం నాయకులు విన్నవించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డికి గురువారం చేనేత కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ మాట్లాడుతూ ధర్మవరంలో చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘించి విచ్చలవిడిగా పవర్‌లూమ్స్‌లో పట్టుచీరలు తయారు చేస్తున్నారన్నారు. రిజర్వేషన్ చట్టాన్ని కాపాడాల్సిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి చేనేత కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. పవర్‌లూమ్స్‌ను అరికట్టి చేనేత పరిశ్రమను కాపాడాలని విన్నవించారు. నాయకులు వెంకటస్వామి, రవికుమార్, రమణ, ఆదినారాయణ, హరి, శ్రీనివాసులు, రవి, శ్రీధర్, గంగాధర్, శ్రీనివాసులు, సురేష్, బాల రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై 'ప్రజావేదిక'



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

తనకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక(బహిరంగ సభ)ను నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ మండలంలో 2023-24 ఏడాదిలో 358 ఉపాధి హామీ పనులను చేపట్టినట్లు తెలిపారు. ఇందుకు గానూ రూ.4.29 కోట్లు ఖర్చు చేశామన్నారు. గతేడాది చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్ బృందంతో తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ట్రెంచ్‌లు, ఫారంపాండ్లు, పండ్లతోటల పెంపకం, డగౌట్ పాండ్లు తదితర పనుల్లో మొత్తం రూ.58,221 అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ ప్రజా వేదికలో అధికారులు వెల్లడించారు. సంబంధిత ఉపాధి హామీ సిబ్బంది వారంలోపు ఆ మొత్తాన్ని చెల్లించాలని అధికారులు ఆదేశించారు. ఎంపీపీ కౌసల్య, ఏపీడీ రమేష్‌బాబు, విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఎస్ఆర్‌పీ తిరుమలేష్, ఎస్టీఎం కోనయ్య, ఎంపీడీఓ వెంకటరమణ, ఏపీఓ మరియమ్మ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



బుక్కపట్నంలో యోగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు



నియోజకవర్గ క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం హెచ్‌ఎం వెంకటాచలం ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, చెస్, యోగా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబుల్‌రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ సుజాత, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: స్కూల్ గేమ్స్‌లో భాగంగా గురువారం బుక్కపట్నం ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. అండర్-14,-17 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జగదీశ్వర్, పీడీ నాగరాజు తెలిపారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న శివశంకర్

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని బ్లూమూన్ జూనియర్ కళాశాలలో గురువారం ఫ్రెషర్ డేను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. బ్లూమూన్ విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్తే జీవితంలో ఏదైనా సాధించగలరన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ట్రోఫీలను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోహర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటేలో ధర్మవరం విద్యార్థినికి గోల్డ్ మెడల్

ధర్మవరం: అనంతపురం గుడ్ చిల్డ్రన్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ధర్మవరం జూడో క్లబ్ విద్యార్థిని ఎ.అక్షయాని మైనస్ 23 కేజీ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిందని స్కూల్ గేమ్స్ కార్యదర్శి సుగుణ, మురారి తెలిపారు. గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థిని అక్షయాని ఈనెల 23,24 తేదీలలో తిరుపతిలో జరిగే జూడో పోటీల్లో పాల్గొననుందని క్లబ్ కోచ్ ఇనాయత్‌బాషా తెలిపారు.

గుణాత్మక విద్యను అందించాలి

చెన్నేకొత్తపల్లి: పాఠశాల విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలి. సులభంగా అర్థమయ్యేలా బోధించాలని రిసోర్స్‌పర్సన్లు రవి కుమార్, నబీరసూల్, గోవిందు, కాంతరాజు సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్లు మాట్లాడుతూ.. ఇంగ్లిష్ సబ్జెక్ట్ బోధనలో ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. పాఠశాలల్లో విద్యార్థులకు వీరగాథలపై వ్యాస రచన పోటీలను నిర్వహించాలని తెలిపారు. రిసోర్స్‌పర్సన్లు రవి కుమార్, నబీరసూల్, గోవిందు, కాంతరాజు, సీఆర్పీలు శివయ్య, నరసింహులు, నాగేంద్రమ్మ కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెకానికల్ ఇంజినీరింగ్‌దే భవిష్యత్తు



విద్యార్థులతో అధ్యాపకులు, యాజమాన్యం

పుట్టపర్తి అర్బన్: మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులదే భవిష్యత్తని జేఎన్‌టీయూ అసోషియేట్ ప్రొఫెసర్ కళ్యాణిరాధ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి సమీపంలోని సంస్కృతి విద్యాసంస్థల్లో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు కెరీర్ అవకాశాలపై అనుమానాలను నివృత్తి చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. అత్యాధునిక సాంకేతికత మెకానికల్ ఇంజినీరింగ్ సొంతమన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. పట్టణాల్లో ఎన్నో పరిశ్రమలు వెలుస్తున్నాయని, ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థికీ ఉద్యోగావకాశాలు వస్తాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రమ శిక్షణతో పాటు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సెంథిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

కదిరి అర్బన్: కాళసముద్రం గ్రామంలో గురువారం పట్నం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. నేత్ర వైద్య నిపుణుడు జయరాం హాజరై విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. అలాగే 22 మంది విద్యార్థులకు కంటి అద్దాలను అందజేశారు.

ఉలవల పంపిణీ

నల్లమాడ: ప్రత్యామ్నాయ పంట సాగుకు వీలుగా సబ్సిడీపై ఉలవలు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. స్థానిక మూడో నెంబరు రైతు సేవా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, సర్పంచ్ భారతి, ఏఓ సుమతి రైతులకు ఉలవలు ప్యాకెట్లు అందజేశారు.

కనగానపల్లి: మండల కేంద్రంలోని సచివాలయం వద్ద గురువారం ఏఓ కృష్ణకుమారి ఆధ్వర్యంలో సబ్సిడీపై రైతులకు ఉలవలు పంపిణీ చేశారు. సర్పంచ్ అంకె రామక్రిష్ణ, ఎంపీటీసీ భాస్కర్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఇది మంచి ప్రభుత్వం'పై సమావేశం

కదిరి అర్బన్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంపై ఎంపీడీఓ అంజనప్ప పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. శుక్రవారం నుంచి 26వ తేదీ వరకు కదిరి మండలంలోని ప్రతి సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు హాజరు అవుతారన్నారు. ఈ ప్రభుత్వం వంద రోజుల పాలనను ఇంటింటికి వివరిస్తామని తెలియజేశారు.

సంక్షిప్త సమాచారం

ఉద్యాన పంటల పరిశీలన

తలుపుల: యరసానిపల్లి, ఉబ్బరవాండ్లపల్లి, నంగివాండ్లపల్లిలో సాగు చేసిన మామిడి, బంతిపూల, అరటి తదితర పంటలను గురువారం హెచ్‌ఓ ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. పంటలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని రైతులకు సూచించారు. ఉద్యాన పథకం కింద రైతులకు బంతి పూల సాగుకు హెక్టారుకు రూ.16 వేలు, అరటికి హెక్టార్‌కు రెండేళ్లకు రూ.40 వేలు అందిస్తామని హెచ్‌ఓ తెలిపారు. వీహెచ్‌ఏలు యాషిన్, నీహారిక, రైతులు పాల్గొన్నారు.

ఉచితంగా ఫ్రీజర్ బాక్సులు

ధర్మవరం అర్బన్: ఎవరైనా మరణిస్తే ఉచితంగా ఫ్రీజర్ బాక్సులు అందిస్తామని షిర్డీ సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరనారాయణ, డైరెక్టర్ సూర్యప్రకాష్ తెలిపారు. స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. షిర్డీసాయిబాబా ఆలయంలో మూడు ఫ్రీజర్ బాక్సులు ఉన్నాయన్నారు. ఈ ఫ్రీజర్ బాక్సులను ఉచితంగా అందిస్తామని, రవాణా ఖర్చు మాత్రమే సంబంధిత వ్యక్తులు పెట్టుకోవాలని తెలిపారు. ఫ్రీజర్ బాక్సు కోసం 9985265364, 9493435310 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: ఉచిత మధుమేహ, పాదాల స్పర్శ పరీక్షల శిబిరానికి మంచి స్పందన వచ్చిందని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం తెలిపారు. పట్టణంలోని ఆర్యవైశ్య కొత్త సత్రంలో గురువారం బెంగళూరులోని జైన్ ఆసుపత్రి వారి సహకారంతో వైద్యులు మనోజ్, మురళీధర్, సీఈఓ అశోక్ బాబు, కోఆర్డినేటర్ మంజునాథ్ పర్యవేక్షణలో శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ సభ్యులు చాంద్‌బాషా, డాక్టర్ బీవీ సుబ్బారావు, పోలా ప్రభాకర్, రమేష్ బాబు, బండ్లపల్లి రంగనాథ్, ఓవీప్రసాద్, వంకదారి మోహన్, జయంతి వినోద్‌కుమార్, బాలం ఆదిశేషు, సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

26 నుంచి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నల్లచెరువు: శ్రీ సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలను ఈ నెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు సత్యసాయి కమిటీ సభ్యులు విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. గురువారం పోటీలకు సంబంధించిన కరపత్రాలను ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, ఎస్‌ఓ శిరీషకు అందజేశారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.